క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



మాచవరం: విద్యుదాఘాతానికి గురై ప్రమాద వశాత్తు యువరైతు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ జానీబాషా (33) మిర్చి పొలానికి నీళ్లు పెట్టేందుకు ఉదయాన్నే వెళ్లాడు. పొలంలోని బోరుబావి మోటారుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పరిశీలించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై ప్రమాదవశాత్తు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఆషాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన జానీబాషా కుటుంబాన్ని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

గురజాల : బాల్యవివాహాలు జరగకుండా వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.రత్నకుమారి సూచించారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం జరిపించాలన్నారు. చిన్న తనంలో వివాహం చేయడం వలన ఎన్నో అనర్థాలకు కారణమవుతాయన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శిశు ఆధార్ కేంద్రం ఏర్పాటు



గురజాల : శిశు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి చిన్నారులకు ఆధార్ కార్డులను నమోదు చేశారు. స్థానిక పెట్రోలు బంక్ వద్ద గల అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పుట్టిన చిన్నారులకు, ఆధార్ లేని వారికి ఆధార్ కార్డులు అందించడం జరుగుతుందని పులిపాడు సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు ఎల్ అమరయ్య తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 15 మంది చిన్నారులు ఆధార్ లేని వారు ఉంటే ఆ ప్రాంతంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై రత్నకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు తదితరులున్నారు.

వలంటీర్లు నిజమైన సేవకులు



దాచేపల్లి : వలంటీర్లు ప్రజలకు సేవకులని సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి అన్నారు. మండలంలోని పొందుగల గ్రామ సచివాలయంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం గురువారం చేపట్టారు. వలంటీర్లను ప్రశంసాపత్రంతో పాటు శాలువా, మెడల్స్‌తో సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైనికులు వలంటీర్లు అని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందజేయాలని ఆయన సూచించారు. ప్రతి వలంటీర్ క్రమశిక్షణ కలిగి ఉండాలని, ప్రజలకు సేవ చేసి మంచి పేరు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యల కల్యాణ మహోత్సవం

గురజాల : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామి వార్ల కల్యాణం జరుగుతుందని అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

మా బడి చూడండి

నాడు.. ఒకప్పుడు గ్రామాలలో బడి చుట్టూ దిబ్బలు, మురుగు నీటి నిల్వలు, ఆవరణలో పశువుల సంచారం, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా వెరసి పాఠశాల వాతావరణమే కరువైన దీన పరిస్థితులను చూశాం

నేడు.. బడి రూపు రేఖలు మారాయి. ఇప్పుడు బడి అంటే గౌరవం పెరిగింది. విద్యార్థులకు బడిపై మమకారం పెరిగింది. చివరకు మొత్తం గ్రామానికే బడి ఒక సామాజిక దేవాలయంగా మార్పు చెందుతున్న తీరు కన్పిస్తోంది.



పాఠశాల పాత కొత్త ఫొటోలు

- రూ.15.94 కోట్లతో నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి
- మండలంలో 90 శాతం మందికిపైగా అమ్మఒడి
- మౌలిక వసతుల కల్పనతో మారిన బడి రూపురేఖలు



కారెంపూడి: గతంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ బడులు సమస్యల నిలయాలుగా మారాయి. గతానికి ఇప్పటికి ప్రభుత్వ పాఠశాలల రూపు చూస్తే ఎవరైనా ఇది కదా అభివృద్ధి అనక తప్పదు. జగనన్న చూపిన శ్రద్ధ ఎంతో మంది పేద పిల్లల పాలిట వరం అయింది. చదువుల తల్లి నీడలో హాయిగా చదువుకుంటున్నారు. తరగతి గదిలో భావిభారత పౌరుల భవిష్యత్తుకు మంచి పునాదులు పడుతున్నాయి.

రూ.15.94 కోట్లతో అభివృద్ధి..

మండలంలో ఉన్న 43 ప్రభుత్వ పాఠశాలలకు నేడు అన్ని సౌకర్యాలు సమకూరాయి. నాడు–నేడు కింద రూ.15.94 కోట్లతో పాఠశాలల అభివృద్ధి జరిగింది. 52 అదనపు తరగతి గదులు నిర్మించారు. టాయిలెట్స్, సురక్షిత మంచినీరు, బెంచీలు, ఫర్నిచర్, మంచి లైటింగ్, ఫ్యాన్లు, గ్రీన్ చాక్ బోర్డ్స్, డిజిటల్ బోర్డులు, కిచెన్ షెడ్లు, ఆట స్థలాల అభివృద్ధి, ఆకర్షణీయమైన రంగులు, గేట్లు, తలుపులు, కిటికీలు ఇలా అక్కడున్న ప్రతి సమస్యను తీర్చారు. ఫస్ట్ ఫేజ్‌లో 20 పాఠశాలలను రూ.5.46 కోట్లతో, సెకండ్ ఫేజ్‌లో 23 పాఠశాలలను రూ.10.48 కోట్లతో అభివృద్ధి చేశారు. ఆ పాఠశాలల్లో చదువుకుంటున్న 5,155 మందిలో 5,020 మందికి అమ్మ ఒడి పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.15 వేలు అందిస్తోంది. గడచిన నాలుగేళ్లలో రూ.30.12 కోట్లు పిల్లలను బడికి పంపుతున్న తల్లులకు ఇవ్వడం జరిగింది.



బాలచంద్రానగర్ ప్రాథమిక పాఠశాల

గతం కంటే వంద రెట్లు బాగుంది..



గతంలో 8 పిరియడ్లు కింద కూర్చుని పాఠాలు వినాల్సి వచ్చేది. కాళ్లు తిమ్మిర్లు ఎక్కి ఏకాగ్రత కుదిరేది కాదు. ఇప్పుడు బెంచీలు, ఫ్యాన్లు, మంచి బ్లాక్ బోర్డులతో క్లాస్ రూమ్ చాలా బాగుంది. టాయిలెట్స్ సౌకర్యవంతంగా ఉన్నాయి. తాగడానికి మినరల్ వాటర్ ఉంది. మంచి ఆట స్థలం ఉంది. గతం కంటే వంద రెట్లు పాఠశాల మారింది. అమ్మఒడి కూడా వస్తోంది.

– షేక్ సమీర, 10వ తరగతి, జెడ్పీ హైస్కూల్, ఒప్పిచర్ల

తరతమ భేదాలు పోయాయి..



యూనిఫాంతో పాటు అందరికి సమాన సౌకర్యాలు కల్పించడం వల్ల అందరం కలసిమెలసి హాయిగా చదువుకుంటున్నాం. గతంలో డ్రెస్‌లలో వ్యత్యాసం కన్పించేది. చాలా మంది మంచి చొక్కా లేదని బాధపడేవాళ్లు. ఇప్పుడు అది లేదు. గతంలో భోజనం బాగోలేక అందరూ ఇంటికెళ్లి తినివచ్చేవారం. కానీ ఇప్పుడు అందరం కలసి కూర్చుని స్కూల్లోనే తింటున్నాం.

– కోటా సంతోష్‌బాబు, 10వ తరగతి, జెడ్పీ హైస్కూల్ ఒప్పిచర్ల

అంతేకాక యూనిఫాం నుంచి పుస్తకాల వరకు ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. ఇదిలా ఉంటే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1,536 మందికి సైతం అమ్మఒడి సాయం అందుతోంది. దీంతో పాటు 5,155 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం జగనన్న గోరు ముద్ద ద్వారా అందుతోంది. గడచిన రెండు దశాబ్దాల కాలంలో జరగని అభివృద్ధి గడచిన నాలుగేళ్లలో జరిగిందనేది వాస్తవం.

కందుల కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయండి



పిడుగురాళ్ల రూరల్: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కందుల కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని జూలకల్లు, పందిడివారిపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు, శాంపిళ్ల సేకరణ రిజిస్టర్లు, బ్యాగులను పరిశీలించారు. కందుల విక్రయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కందులకు కనీస మద్దతు ధరగా రూ.9,755 ప్రకటించిందని, రైతులు రైతు భరోసా కేంద్రాల్లో కందులను విక్రయించుకోవచ్చని తెలియజేశారు. కందులు విక్రయించిన రైతులకు మూడు లేదా నాలుగు రోజుల్లోనే నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు రవి కుమార్, శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం



కారెంపూడి: స్థానిక యూనియన్ బ్యాంక్ 10వ వార్షికోత్సవ వేడుక బ్యాంకులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఖాతాదారులతో కలసి బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ అక్కి భాస్కర రావు కేక్ కట్ చేశారు. కారెంపూడిలో బ్యాంకు శాఖను ప్రారంభించిన పదేళ్లలోనే ఖాతాదారులకు విశేష సేవలందించామని, గణనీయమైన టర్నోవర్‌తో పాటు వ్యవసాయ, వాణిజ్య రంగాల వారితో పాటు చిరు వ్యాపారులకు కూడా ఎక్కువగా రుణాలిచ్చి వారిని ప్రోత్సహించామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది హనుమాన్ నాయక్, దత్తాత్రేయ షిండే, గోపీచంద్, జ్యోతి, ఏడుకొండలు, భాస్కరాచారి, బిజినెస్ కరస్పాండెంట్ ప్రసాద్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు పార్టీ ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం

గురజాల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్టీ ప్రజాప్రతినిధులుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి తెలిపారు. రేషనలైజేషన్, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు విషయంపై సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీల కన్వీనర్‌లు, పాల్గొనాలన్నారు.

భక్తులకు సేవ చేసేందుకు సమష్టిగా కృషి చేద్దాం

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు సేవచేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి శాంతిభద్రతలు, వైద్యం, రవాణా, తదితర ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించగలుగుతామన్నారు. తహసీల్దార్ ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చే వేలాది వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి పరిచేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ రెంటపాళ్ల పిచ్చయ్య మాట్లాడుతూ గత ఏడాది 32 బస్సులు ఏర్పాటు చేశామని ఈ ఏడాది కూడా 32 బస్సులు నడుపుతామని అవసరమైతే బస్సులను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, ఎస్‌ఐ కె.వెంకట నారాయణరెడ్డి, దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో నెవలిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఏపీట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఈవోపీఆర్డీ జి.కోటేశ్వరరావు, కార్యదర్శి బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ

హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల పందేలు

- న్యూ కేటగిరీలో హైదరాబాద్ ఎడ్లు ప్రథమ స్థానం
- సబ్ జూనియర్ విభాగంలో వేటపాలెం, యనమలకుదురు కంబైన్డ్ జత

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా న్యూ కేటగిరీ సేద్యపు విభాగంలో నిర్ణీత సమయం కంటే 2 నిమిషాల ముందే ప్రగతి రిసార్ట్స్ హైదరాబాద్‌కు చెందిన మేకా ప్రతీక రామకృష్ణ ఎడ్ల జత 4600 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలవగా, లాయర్ కృష్ణ (దర్శి, కంభం, ప్రకాశం జిల్లా) ఎడ్లు 4218.6 అడుగుల దూరంతో 2వ స్థానంలో, యల్లం సాంబశివరావు (లింగాయపాలెం, గుంటూరు) ఎడ్లు 4125 అడుగులతో 3వ స్థానంలో నిలిచాయి. దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి (నాదెండ్ల, పల్నాడు జిల్లా), అక్కినేని ముకుల్ సత్య చౌదరి (మల్లవల్లి, కృష్ణా జిల్లా), తెండపు వెంకటేశ్వర్లు (లింగాయపాలెం, గుంటూరు), వెలవెల జయంత్ చిన్న కల్లేపల్లి, ఘంటశాల, కృష్ణా జిల్లా) ఎడ్ల జతలు వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి.



సబ్ జూనియర్ విభాగం పోటీల్లో బండ లాగుతున్న ఎద్దు

సబ్ జూనియర్ విభాగంలో..

సబ్ జూనియర్ విభాగంలో అత్తోట శిరీషాచౌదరి శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు మండలం, బాపట్ల), అనంతనేని శ్రీకావ్య శ్రీమధు (యనమలకుదురు, కృష్ణాజిల్లా) కంబైన్డ్ ఎడ్లు 3903.8 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరి (కొండబాలవారిపాలెం, గుంటూరు జిల్లా) ఎడ్లు 3559 అడుగుల దూరంతో 2వ స్థానంలో, యరమల శౌషితా రెడ్డి (బూరుసుపల్లి, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా), పెన్నబోయిన సూర్య హషివేక్ యాదవ్ (రెంటాల, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా) కంబైన్డ్ ఎడ్ల జత 3258.9 అడుగులతో 3వ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

వైఎస్సార్ ముస్లింలకు చేసిన మేలు మరువలేనిది

ముస్లింల ఆత్మీయ సమావేశం

మాచర్ల: స్వర్గీయ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింల అభివృద్ధికి 4 శాతం రిజర్వేషన్ తెచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా వేలాది మందిని డాక్టర్లు, ఇంజనీర్లు చేయటంలో ఆయన చేసిన కృషి మైనార్టీలు మరువలేనిదని మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ట్రాక్టర్ కరిముల్లా, స్టేట్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పలపాటి జానీలు అన్నారు. గురువారం పట్టణంలోని వైభవ్ రెసిడెన్సీ ఫంక్షన్ హాలులో 26వ వార్డు కౌన్సిలర్ షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ బాటలోనే సీఎం జగన్ కూడా మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ముస్లింల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సీఎం జగన్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా మాచర్ల నియోజకవర్గంలో కోట్ల రూపాయలు సొంత నిధులతో ముస్లిం కమ్యూనిటీ హాలు, ఈద్గా తదితర పనులు చేపట్టిన పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మద్దతుగా ముస్లింలంతా ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమావేశంలో కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, మస్తాన్, షేక్ సుభాని, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు నల్ల వెంకటరెడ్డి, అల్లావుద్దీన్, మారాబత్తుల శ్రీనివాసరావు, నక్షత్రపు శేఖర్, చదలవాడ చిన్ని, అంగార్ బాషా, యాసిన్, సులేమాన్ పాషా, బాషిత్, పఠాన్ గౌస్ తదితరులున్నారు.




ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మైనార్టీ నాయకులు

మైనర్‌లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

పిడుగురాళ్ల: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లి దండ్రులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సీఐ పి.వి.ఆంజనేయులు గురువారం తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో రాత్రి వేళల్లో కొంత మంది యువకులు ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేయడం వంటివి చేస్తున్నారని అటువంటి విన్యాసాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా లైసెన్సు కలిగివుండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దుర్గి: మండల పరిధిలోని మంగాపురం తండాలో నూతనంగా నిర్మించిన పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రకటించిన రూ.లక్ష సాయాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందించారు. అనివార్యకారణాల వలన రాలేకపోయిన పీఆర్కే తాను ప్రకటించిన రూ.1లక్ష పంపి వారికందించారు. కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, సర్పంచ్ గొంది నాసరయ్య, చాగంటి బ్రహ్మానందరెడ్డి, పసుపులేటి వెంకట్రామయ్య, మాదాసు వెంకటేశ్వర్లు, జాస్తి రామ్మూర్తి కేశంశెట్టి పెద అంజయ్య, ఎంపీటీసీ బొంత కృష్ణ, భిక్షమయ్య, హనుమంతు, బీరినీడి చంద్రయ్య, దేవరకొండ పున్నారావు, పుట్టా మారుతి, భోజ్యానాయక్, కొల్లి హనుమయ్య, కట్టబోయిన రవి, బీర్నిడి బంగారయ్య, బాలనాయక్, రామారావునాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్య మానసిక దృఢత్వానికి నాంది

మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యనందుకుంటున్న విద్యార్థులు చదువుతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని కలిగి ఉంటారని రూరల్ సీఐ కె.సురేష్ అన్నారు. గురువారం మండలంలోని కొప్పునూరు గ్రామ జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం ఇష్టంతో కష్టపడి చదవాలని, 10వ తరగతి విద్యార్థులకు ఎంతో కీలకమని, రానున్న పరీక్షల్లో ఒత్తిడికి లోనవ్వకుండా నిర్దిష్టమైన ప్రణాళికతో పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దలేదని, పోషకాలతో కూడిన భోజనం, ఉచిత యూనిఫాం, టెక్స్, నోట్ బుక్స్ అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, విజయపురిసౌత్ ఎస్‌ఐ కొండారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ గుర్రపు అంకాలు, ఆంజనేయులు తదితరులున్నారు.

ఘనంగా కన్నెగంటి హనుమంతు వర్ధంతి

మాచర్ల: స్వర్గీయ పుల్లరి యోధుడు కన్నెగంటి హనుమంతు బ్రిటీషు వారికి వ్యతిరేకంగా చేసిన పుల్లరి ఉద్యమం మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు, కాపు సంఘం నేతల ఆధ్వర్యంలో స్వర్గీయ కన్నెగంటి హనుమంతు వర్ధంతి కార్యక్రమం బస్టాండ్ ఎదురు కన్నెగంటి విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసశర్మలు మాట్లాడుతూ ఆ రోజుల్లో అడవికి వెళ్లే వారిపై బ్రిటీషు వారు దౌర్జన్యం చేసి పుల్లరి పన్ను వసూలు చేసేవారు. దీనికి వ్యతిరేకంగా పుల్లరి పోరాటాన్ని చేసి అసువులు బాసిన కన్నెగంటి హనుమంతు దుర్గి మండలానికి చెందిన వ్యక్తి కావటం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పలువురు కాపు సంఘ నేతలు కన్నెగంటి హనుమంతు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసనాయుడు, కౌన్సిలర్లు మందా సంతోష్, కిషోర్, షేక్ దస్తగిరి, కో ఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, పలువురు సంఘాల నాయకులు కొండసాని మంగిరెడ్డి, నట్టువ రాధాకృష్ణ, పిల్లి కొండలు, బొంగురుతో పాటు పలువురు పాల్గొన్నారు.



కన్నెగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, తదితరులు

దుర్గిలో కన్నెగంటి హనుమంతు వర్ధంతి

దుర్గి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లరి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం దుర్గిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ తొలితరం విప్లవ వీరుడు కన్నెగంటి హనుమంతు మండలంలోని మించాలపాడులో జన్మించటం గర్వకారణమన్నారు. బ్రిటీషు వారి ఆగడాలను సహించలేని ఆయన చిన్నతనంలోనే మహాత్మాగాంధీ పిలుపునందుకొని సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కన్నెగంటి హనుమంతు ఘాట్ వద్ద పార్టీ నేతలు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, జక్కా సీతారామయ్య, వారణాసి నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతును స్ఫూర్తిగా తీసుకోవాలి

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధులు..పల్నాటి పుల్లరి ఉద్యమ పోరాట యోధుడు కన్నెగంటి హనుమంతును నేటి యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఇంటర్నేషనల్ కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కన్నెగంటి హనుమంతు వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రిటీష్ ముష్కరుల కాల్పుల్లో అశువులు బాసిన హనుమంతు జీవితాన్ని ఎందరో ఉద్యమకారులు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, లక్ష్యం, దృఢ సంకల్పం, నైతిక విలువలు కలిగి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ముందుగా స్కూల్ ఆవరణలో ఆయన తాజా మాజీ సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, గ్రామ పెద్దలతో కలిసి కన్నెగంటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదె లూర్దుమర్రెడ్డి, కనకం సుధాకర్‌నాయుడు, నాళం పెదబాబు, యేచూరి వెంకట సైదయ్య, సూరపరెడ్డి పుల్లారెడ్డి, ఆకుల నర్సింహారావు, నాళం చినబాబు, కర్నాటి కోటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కన్నెగంటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, కాపు సంఘ నేతలు

తుమ్మకోటలో మిర్చిపంట దిగుబడి అంచనా 27.5 క్వింటాళ్లు



తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో గణాంక శాఖ ద్వారా మిర్చిపంట దిగుబడి అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి గురువారం తెలిపారు. గ్రామ శివార్లో ఖరీఫ్ 2024 సంవత్సరంలో ఎంపిక చేయబడిన దిర్శినాల రమాదేవి అనే రైతు 531 సర్వే నంబర్‌లో సాగు చేస్తున్న మిర్చిపంట పొలంలో 25 మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేశామన్నారు. దీనిలో భాగంగా ఒక ఎకరాకు దిగుబడి ఎండు మిర్చి సుమారు 27.5 క్వింటాళ్లుగా అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శ్రీలత, రైతులు పాల్గొన్నారు.